క్లుప్తంగా

100 కేజీల బియ్యం వితరణ



మొవ్వ: స్థానిక వేమూరి సుందర రామయ్య ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ మాధవి అధ్యక్షతన, కెప్టెన్ వెంకయ్య ఆధ్వర్యంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ద్వారా 'హ్యాండ్ ఫుల్ ఆఫ్ రైస్'(గుప్పెడు బియ్యం') అనే కార్యక్రమం ద్వారా100 కేజీలు బియ్యాన్ని పోగుచేసి స్వచ్ఛంద సంస్థలకు అందజేశారు. మండలంలోని లైఫ్ గివెర్స్ సంస్థకు 50 కేజీలు, చల్లపల్లిలోని సీయోను సేవా మినిస్ట్రీస్ వారి ఆధ్వర్యంలో నడుస్తున్న వృద్ధాశ్రమానికి 50 కేజీలను అందజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ కేఆర్ మంజుల, నాక్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎల్వీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

దళితవాడకు శ్మశానభూమి ఏర్పాటు

పమిడిముక్కల: రాష్ట్ర ఉపలోకాయుక్త జస్టిస్ పి.రజని ఆదేశాలతో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్ శ్మశానభూమి నిమిత్తం భూసేకరణకు నిధులు మంజూరు చేయడంతో పైడికొండలపాలెం దళితవాడకు శ్మశాన భూమి ఏర్పడింది. ఇందుకోసం య.0–87 సెంట్ల భూమిని సేకరించినట్లు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ తెలిపారు.

నేటి నుంచి శ్రీ పుట్టలాంబ అమ్మవారి బ్రహ్మోత్సవాలు

గుడివాడ టౌన్: నందివాడ మండలం జనార్దనపురంలో వేంచేసియున్న శ్రీ రేణుకా పుట్టలాంబ అమ్మవారి పంచవింశతా వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభించనున్నారు. ఈనెల 19వ తేదీ వరకు ఉత్సవాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సభను జయప్రదం చేద్దాం

గుడివాడ టౌన్: రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకునే నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణను అడ్డుకునేందుకు దళిత నాయకులు ఏకం కావాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కమిటీ సభ్యులు పొంగులేటి జయరాజు శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు గుడివాడ మందపాడులో నిర్వహించనున్న సభకు పలువురు దళిత నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సభకు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

పంచాయతీ కార్మికుల సేవలు ఎనలేనివి

పామర్రు: పంచాయతీ కార్మికులుగా ఉంటూ రెల్లి కులస్తులు ఎనలేని సేవలను అందిస్తున్నారని మచిలీపట్నం వీపీఎఫ్ అధ్యక్షుడు చెన్న ఆకుల అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదురుగా రెల్లి కులస్తులతో అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రెల్లి కుల అభివృద్ధికి దోహద పడే పుస్తకాన్ని వారికి ఉచితంగా అందజేశారు. ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షులు సాల్మన్‌కొల్లాబత్తుల తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



పామర్రు: బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. పెదపారుపూడి గ్రామానికి చెందిన పాత కోటి అశోక్ ప్రమాదవశాత్తు గాయపడ్డారు. దీంతో బాధితుడికి రూ.10వేలను ఎమ్మెల్యే శనివారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వల్లూరిపల్లి గణేష్, కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పీ-4 సర్వే ప్రారంభం

గుడ్లవల్లేరు: ప్రజలకు మేలు చేకూర్చేందుకు ప్రభుత్వం పీ–4 సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ టి.విజయసారధి తెలిపారు. పీ4 సర్వేను శనివారం నుంచి ఆయన అంగలూరులో ప్రారంభించారు. ఈ సర్వేలో భాగంగా ఇంటింటికీ చేస్తున్న సర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. గ్రామ కార్యదర్శి ఎలీషారావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ తీగల అపహరణపై రైతుల ఆందోళన

తోట్లవల్లూరు: వల్లూరుపాలెం లంకలో విద్యుత్ తీగల అపహరణపై రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లంకలోని పలు పొలాల్లో వ్యవసాయానికి ఉపయోగించే విద్యుత్ సబ్‌మెర్సిబుల్ మోటార్ల విద్యుత్ తీగల చోరీ గురువారం రాత్రి జరిగింది. సుమారు రెండు వందల మోటార్ల వరకు విద్యుత్ తీగల చోరీ జరిగి ఉండొచ్చని రైతులు తెలిపారు. ఒక్కో రైతుకు రూ. 3 వేలకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. పోలీసులు ఇప్పటికైనా స్పందించి విద్యుత్ తీగల దొంగలను గుర్తించి తగిన చర్యలను తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

తోట్లవల్లూరు: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని మెగా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్(మెయిల్) ప్రతినిధి కొమ్మారెడ్డి బాపిరెడ్డి సూచించారు. మండలంలోని భద్రిరాజుపాలెం ఎంపీయూపీ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. 1 నుంచి 8వ తరగతి వరకు చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు దాత బాపిరెడ్డి, విజయభాస్కరమ్మ దంపతులు రూ. 44 వేల నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.

వక్తృత్వ పోటీల్లో అంగలూరు విద్యార్థిని ప్రతిభ

గుడ్లవల్లేరు: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో అంగలూరు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల్లో 8వ తరగతి విద్యార్థిని దావులూరి అలీ మోన్స్‌కు జిల్లా స్థాయి ద్వితీయ బహుమతి లభించింది. ఈ విషయాన్ని ఎంఈఓలు జగన్‌మోహన్‌రావు, గోపాలరావు తెలిపారు. శనివారం మచిలీపట్నంలోని జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో విజేతకు బహుమతిని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కలెక్టర్ డి.కె.బాలాజీ, ఎస్పీ గంగాధరరావు, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ అందించారని పేర్కొన్నారు.



మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి


అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న సీడీపీఓ

కైకలూరు: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ రచయిత్రి, డాక్టర్ సీ.భవానీదేవీ పేర్కొన్నారు. కైకలూరు ఎన్జీఓస్ కాలనీ ఓం నమోస్తుతి క్షేత్రంలో ప్రముఖ డాక్టర్ ప్రశాంతి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం శనివారం జరిగింది. ఈ సందర్భంగా భవానీదేవీ మాట్లాడుతూ నేటి సమాజంలో పురుషులతో పాటు మహిళలు అన్ని రంగాల్లో పోటీపడుతున్నారన్నారు. అనంతరం ఆమెను ఘనంగా సన్మానించారు. ఎంపీపీ అడవి కృష్ణ, వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీలత, న్యాయవాదులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

మహిళా దినోత్సవం సందర్భంగా మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కైకలూరు పంచాయతీ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం చేశారు. నూతన వస్త్రాలు, పండ్లు అందించారు. సంస్థ అధ్యక్షురాలు కొండ్రెడ్డి చిట్టెమ్మ పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో..

మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో కైకలూరు కోర్టు వద్ద అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి వీవీఎస్వీ లక్ష్మీ, జూనియర్ సివిల్ జడ్జి ఎం.శివకిరణ్, కైకలూరు బార్ ప్రెసిడెంట్ వేంపాటి సాయి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు అవార్డుల అందజేత

ముదినేపల్లి రూరల్ : మహిళా దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కార్యకర్తలకు కైకలూరు ఐసీడీఎస్ సీడీపీఓ వి దీప్తి ముదినేపల్లిలో శనివారం అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. సింగరాయపాలెం సెక్టార్‌లో అల్లూరుకు చెందిన కార్యకర్త సీహెచ్ భాగ్యలక్ష్మి, సింగరాయపాలెం నుంచి వి రత్నతులసీ, వడాలి సెక్టార్‌లో చిగురుకోట అంగన్‌వాడీ కార్యకర్త అరుణ కుమారి, వడాలి నుంచి జ్యోతి, కొత్తపల్లి సెక్టార్లో వైవాకకు చెందిన కార్యకర్త రోజా రాణి, ప్రొద్దువాకకు చెందిన సంధ్యారాణి ప్రశంసాపత్రాలు అందుకున్నారు. అదేవిధంగా ముదినేపల్లి సెక్టార్‌లో ముదినేపల్లి కార్యకర్తలు జ్యోతి, రాధాకృష్ణకుమారి ప్రశంసాపత్రాలు పొందినవారిలో ఉన్నారు.


కవయిత్రి భవానీదేవిని సన్మానిస్తున్న దృశ్యం

మండవల్లిలో..

మండవల్లి: మహిళా దినోత్సవం పురస్కరించుకుని శనివారం మండవల్లి సర్పంచ్ మెండా ఝాన్సీని స్థానిక సచివాలయం లోని మహిళలు ఘనంగా సత్కరించారు. సచివాలయ సిబ్బంది గాయత్రి, కనక దుర్గ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం

సీనియర్ సివిల్ జడ్జి వీవీఎల్వీ లక్ష్మి


కోర్టు ఆవరణలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మి

కైకలూరు: కేసుల పరిష్కారంలో రాజీమార్గమే రాజమార్గమని సీనియర్ సివిల్ కోర్టు జడ్జి వీవీఎస్వీ. లక్ష్మి పేర్కొన్నారు. కైకలూరు కోర్టులో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా కక్షిదారులకు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మొత్తం 788 వివిధ కేసులను పరిష్కరించారు. జూనియర్ సివిల్ జడ్జి ఎం.శివకిరణ్, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు వేంపాటి సాయి సత్యనారాయణ, కైకలూరు రూరల్ సర్కిల్ సీఐ వి.రవి కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

బాల, బాలికల కబడ్డీ జట్ల ఎంపిక



మొవ్వ: స్థానిక శ్రీ మండవ కనకయ్య జెడ్పీ హైస్కూలు క్రీడా మైదానంలో ఉమ్మడి కృష్ణా జిల్లా సబ్ జూనియర్ బాల,బాలికల కబడ్డీ జట్లను ఎంపిక చేసినట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు రామారావు, మండలి మనోహరి శనివారం తెలిపారు. బాలుర విభాగంలో 12 మంది క్రీడాకారులతోపాటు మరొక ఆరుగురిని (రిజర్వుడు) ఎంపిక చేశామని తెలిపారు. బాలికల విభాగంలో 15 మంది క్రీడాకారిణిలను సెలెక్ట్ చేసినట్లు పేర్కొన్నారు.

పెద్దింట్లమ్మా.. రక్షించమ్మా..



కైకలూరు: కొల్లేటికోట పెద్దింటమ్మ జాతర శనివారానికి 8వ రోజుకు చేరుకుంది. అమ్మవారికి ధూప సేవ, బాల భోగం, నీరాజన మంత్రపుష్పం ఆలయ ప్రధాన అర్చకులు పరమేశ్వరశర్మ నిర్వహించారు. పెద్దింట్లమ్మకు వస్త్ర, పుష్పాలంకరణ, ఉచిత ప్రసాద దాతలుగా భుజబలపట్నంకు చెందిన పెనుమత్స నాగ వెంకట పాండురంగారావు, మణికంఠ కృష్ణంరాజు దంపతులు వ్యవహరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా గుడివాడ కొడాలి రాజా ఆధ్వర్యంలో పౌరాణిక నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. ఈఓ కూచిపూడి శ్రీనివాసు మాట్లాడుతూ సోమవారం జలదుర్గగోకర్ణేశ్వరస్వామి కల్యాణోత్సవం జరుగుతోందని బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు.



చల్లని తల్లి గంగానమ్మ

గ్రామస్తుల ఇలవేల్పుగా అమ్మవారు

పామర్రు: భక్తులు అడిగినదే తడవుగా కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ గంగనమ్మ తల్లి పేర్గాంచింది. 1950లో గంగానమ్మ తల్లికి భక్తుల సహకారంతో పామర్రులో చిన్న ఆలయాన్ని నిర్మించారు. గతంలో ఒక్కరోజు మాత్రమే గ్రామోత్సవం నిర్వహించేవారు. తర్వాత కాలంలో అది మూడురోజులగా మారింది. గ్రామం పెరిగి పెద్దది కావడంతో ఈ జాతర మహోత్సవాలను 2000 సంవత్సరం నుంచి వారం రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఏటా అమ్మవారి ఆలయ జాతరకు భక్తుల తాకిడి ఎక్కువగా ఉండటంతో వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా బలమైన కట్టడాలతో ఆలయాన్ని పునర్నిర్మించారు. ఆలయంలో ముందు ముఖ ద్వారం ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి బొమ్మారెడ్డి కుటుంబ సభ్యులు ఆలయ నిర్వహణ బాధ్యతలను నిర్వహిస్తున్నారు.


గంగానమ్మతల్లి

ఏడు ప్రాంతాల్లో అమ్మవారి ఊరేగింపు

వారం రోజులు పాటు నిర్వహించే జాతరను గ్రామాన్ని ఏడు భాగాలుగా విభజించి ఏడు రోజులు ఏడు ప్రాంతాల్లో అమ్మవారి ఊరేగింపు చేస్తున్నారు. చివరి రోజైన ఈనెల 9వ తేదీ ఆదివారం ఆలయానికి వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని నివేదనలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు.

ఏర్పాట్లు పూర్తి

ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ చివరి రోజున భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఆలయంలో సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పోలీసుల గస్తీ నిరంతరం ఉంటుందని గంగానమ్మ ఆలయ కమిటీ చైర్మన్ బొమ్మారెడ్డి వెంకట రామిరెడ్డి, కమిటీ సభ్యులు నందిపాటి బాల సుబ్రమణ్యేశ్వరరెడ్డి, బొమ్మారెడ్డి రాజేష్‌రెడ్డి, మర్రెడ్డి అంజిరెడ్డి, గుజవర్తి శేఖర్‌రెడ్డి, మున్నంగి శ్రీనివాసరెడ్డి, దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి, కూసం సుబ్బారెడ్డి, మనోహర్‌రెడ్డి, నందిపాటి ఓంకార్‌రెడ్డి పేర్కొన్నారు.


జాతర మహోత్సవం











వెంకన్న భక్తులకు అన్నసమారాధన



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామిని దర్శించుకునేందుకు శనివారం స్వామి సన్నిధిలో భక్తుల తాకిడి అధికమైంది. భక్తులు తమ తమ మొక్కులను భక్తి ప్రపత్తులతో తీర్చుకున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నసమారాధనను నిర్వహించారు. కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు ప్రారంభించారు.

13న పుష్పయాగం

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో ఈ నెల 13వ తేదీన నవమ పుష్పయాగ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని శనివారం దేవస్థాన ధర్మకర్తలు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు తెలిపారు.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

పమిడిముక్కల: మంటాడలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఈఓ మాధవీలత తెలిపారు. వ్యవస్థాపక ధర్మకర్త రామ్మోహనరావు ఆధ్వర్యంలో ఉత్సవాలకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.











క్లుప్తంగా

ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించండి

మండవల్లి: ఐదేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అయ్యవారిరుద్రవరం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ పిచ్చోడు శుక్రవారం తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పాఠశాల పరిధిలోని ఐదేళ్లు నిండిన పిల్లల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులతో ప్రభుత్వ పాఠశాల పనితీరు గురించి అవగాహన కల్పించి, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. వచ్చే విద్యా సంవత్సరంలో పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని అవగాహన కల్పించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

ముదినేపల్లి రూరల్: మండలంలోని కొరగుంటపాలెంలో శ్రీవిజయగణపతిస్వామి విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం వైభవంగా జరిగింది. పరిసర గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు ప్రతిష్ఠలో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, పార్టీ ముదిరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్, నాయకులు అచ్యుత రాంబాబు, బత్తిన కిషోర్, పాము రవికుమార్, శీలం రామకృష్ణ, పేరే రామకృష్ణ, సిరివెల్ల వెంకటేశ్వరరావు, పరసా నాగరాజు పాల్గొన్నారు.

పంచాయతీని సందర్శించిన కేరళ ప్రతినిధులు



గుడ్లవల్లేరు: కేరళ రాష్ట్రానికి చెందిన కిలా సంస్థ ప్రతినిధులు గుడ్లవల్లేరు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని శుక్రవారం పరిశీలించారు. గుడ్లవల్లేరు, నాగాయలంక పంచాయతీలు అందిస్తున్న సేవలను పంచాయతీ రాజ్ కమిషనర్ గుర్తించారని ఎంపీడీఓ టి.విజయసారథి తెలిపారు. కమిషనర్ ఆదేశాలను అనుసరించి గుడ్లవల్లేరు పంచాయతీని సందర్శించారని చెప్పారు. ఐఎస్ఓ సర్టిఫికెట్ నిమిత్తం చేయవలసిన మార్పులు చేర్పులపై కేరళ ప్రతినిధులు తెలియజేశారని గ్రామ కార్యదర్శి నరసింహారావు తెలిపారు.

పెద్దింట్లమ్మ తల్లికి పూజలు

కైకలూరు: అమ్మా.. పెద్దింట్లమ్మ.. మా కష్టాలను తీర్చమ్మా.. అంటూ భక్తులు శుక్రవారం కొల్లేటికోట పెద్దింట్లమ్మను వేడుకున్నారు. సమీప జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేశారు. అమ్మవారికి అష్టోత్తర నామ కుంకుమ పూజ, పరిమళ పాత్రసాధన, పంచహారతులు అందించారు. అమ్మవారికి వస్త్ర, పుష్పాలంకరణ, ఉచిత ప్రసాద దాతలుగా భుజబలపట్నంకు చెందిన ముదునూరి వెంకట శ్రీనివాసరాజు దంపతులు వ్యవహరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆలపాడు విజ్ఞాన్ స్కూల్ విద్యార్థులు ఏవీ.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రదర్శించిన కల్చరల్ జానపద డ్యాన్స్ ఆకట్టుకుంది.

సమాజంలో మహిళాశక్తి గొప్పది

- సీనియర్ సివిల్ జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి
- నేడు మహిళా దినోత్సవం సందర్భంగా గుడివాడ, పామర్రు, కైకలూరు నియోజకవర్గాల్లో కార్యక్రమాలు

కైకలూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గుడివాడ, పామర్రు, కైకలూరు నియోజకవర్గాల్లో శుక్రవారం పలు కార్యక్రమాలను నిర్వహించారు. కైకలూరు మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో కైకలూరు జాగృతి స్కూల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. సమాజంలో మహిళా శక్తి ఎంతో గొప్పదని, అన్ని రంగాల్లో నేడు మహిళలు ముందంజలో ఉండాలని సీనియర్ సివిల్ కోర్టు జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి చెప్పారు. మహిళా చట్టాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. పలు అంశాలపై ప్రసంగించారు. అనంతరం ఉపాధ్యాయులు జడ్జిని సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాది పవన్‌కాంత్, స్కూల్ ప్రిన్సిపాల్ పాణెం జయకిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో..

కైకలూరు ఐసీడీఎస్ సీడీపీవో దీప్తి ఆధ్వర్యంలో కైకలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో పలు రంగాల్లో రాణించిన మహిళలను సన్మానించారు. నియోజకవర్గ అంగన్‌వాడీ సెంటర్లలో ప్రతిభ చూపిన 26 మంది అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రశంసాపత్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, కూటమి నేత పెన్మత్స త్రినాథ రాజు, తహసీల్దారు ఎండీ.ఇబ్రహీం, ఎంఈవో డి.రామారావు, ఎంపీటీసీ మంగినేని రామకృష్ణ, ఏఎంసీ సెక్రటరీ సౌజన్య, లాయర్ ఇందిర, పోలవరపు లక్ష్మీరాణి, డాక్టర్ అన్నపూర్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో..

ఆటపాక వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ప్రిన్సిపాల్ వై.శ్రీలత ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆటపాక, కైకలూరు సర్పంచ్‌లు తలారి మణి, దానం మేరీ నవరత్నకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సంధ్య, జ్ఞానప్రసూనాంబ పాల్గొన్నారు.

లింగ వివక్ష లేని సమాజం రావాలి

గుడివాడ టౌన్: మహిళా సాధికారిత, స్వయం నిర్ణయాధికారం ఉండేలా మహిళలకు స్వేచ్ఛ ఉండాలని గుడివాడ సాయి ఉషోదయ పబ్లిక్ స్కూల్ వ్యవస్థాపకురాలు తుమ్మల రత్న అన్నారు. స్థానిక ఏఎన్నార్ కళాశాలలో జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల ఉమెన్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తుమ్మల రత్న మాట్లాడుతూ సమాజం ఎంత అభివృద్ధి చెందినా లింగ వివక్ష కొనసాగుతూనే ఉందన్నారు. మహిళలకు సమాన విద్య, ఉద్యోగ అవకాశాలు, భద్రత, ఆరోగ్య సంరక్షణ వంటి వాటిలో సమానత్వం ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉమెన్ డెవలప్‌మెంట్ సెంటర్ చైర్‌పర్సన్ డి.విమల కుమారి, సెక్రటరి ఎ. దుర్గాభవాని, ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం తుమ్మల రత్నను ఘనంగా సత్కరించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

పమిడిముక్కల: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, విద్యావంతులుగా ఎదగాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీరాణి పేర్కొన్నారు. కృష్ణాపురం ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. లింగనిర్ధారణ చట్టపరంగా నేరమని తల్లులకు వివరించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఆనందకుమారి, తల్లులు పాల్గొన్నారు.

మొవ్వ: మనం నిజాయితీ, నైతిక విలువలతో పని చేసి ఉన్నతులుగా ఎదగాలని ఘంటసాల కేవీకే సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ డి.సుధారాణి సూచించారు. మొవ్వ గ్రామంలోని వేమూరి సుందర రామయ్య ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ డి.సుధారాణిని, ఇమ్మానుయేల్ స్కూల్ కరస్పాండెంటెంట్ వేమూరి అమ్మణిలను ఘనంగా సత్కరించారు. అమ్మణి మాట్లాడుతూ శరీరాన్ని, మనస్సుని పవిత్రంగా ఉంచుకుంటూ అందరికీ మంచి చేయాలనే ఉద్దేశంతో ముందుకు సాగాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మాధవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మ విశ్వాసంతో విజయం సాధించాలి

గుడ్లవల్లేరు: ఆత్మ విశ్వాసంతో అన్ని రంగాల్లో విజయం సాధించాలని విజయవాడ ఐ.ఎం.ఐ.ఎస్ ఫార్మాస్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వి.నాగలక్ష్మి అన్నారు. గుడ్లవల్లేరులోని వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్ సైన్సెస్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమెను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు శుక్రవారం సన్మానించారు. మహిళల దినోత్సవం పురస్కరించుకొని కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఏ సాయిదాత్రి, కె.పరిమళను సత్కరించారు.



కైకలూరు స్కూల్‌లో జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మిని సన్మానిస్తున్న ఉపాధ్యాయినులు



కైకలూరు వ్యవసాయ మార్కెట్‌లో మహిళలకు సత్కారం



కైకలూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీలత



గుడివాడలో తుమ్మల రత్నను సత్కరిస్తున్న ఉమెన్ డెవలప్‌మెంట్ సభ్యులు



పామర్రులో మహిళలను సత్కరిస్తున్న కళాపీఠం అధ్యక్షుడు వెంకట మురళీకృష్ణ



కృష్ణాపురంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ ఝాన్సీరాణి



మొవ్వలో అతిథులను సత్కరిస్తున్న కళాశాల అధ్యాపక బృందం



గుడ్లవల్లేరులో నాగలక్ష్మిని సన్మానించిన ప్రిన్సిపాల్

మహిళలకు సత్కారం

పామర్రు: పద్మశ్రీ ఘంటసాల కళాపీఠం ఆధ్వర్యంలో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో పలు రంగాలలో నిష్ణాతులైన మహిళలను అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీ కృష్ణ మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాలలో ముందంజలో ఉన్నారని అన్నారు. మహిళలు ఇంటికి దీపాలని, వారు ఉంటేనే ఇంటికి కళాకాంతులు ఉంటాయని అన్నారు. అనంతరం స్థానిక సీహెచ్‌సీలో ఉన్న మహిళా వైద్యులు, నర్సులు, ఏఎన్ఎంలతో పాటుగా పలు రంగాలలో నిష్ణాతులైన మహిళలు 25 మందిని గుర్తించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మహిళల గురించి ఘంటసాల పాటలను మురళీ కృష్ణ పాడి వినిపించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్ బాబు, కళాపీఠం సభ్యులు బావురపల్లి పద్మజ, విజయకుమారి, రజని పాల్గొన్నారు.

నేటి నుంచి పీ -4 సర్వే

గుడివాడ టౌన్: పట్టణంలో ఈనెల 8వ తేదీ నుంచి 18వ తేదీ వరకు పి-4 సర్వే నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఆర్థికాభివృద్ధి, పేదరిక నిర్మూలన కొరకు జరిగే సర్వేను సచివాలయ కార్యదర్శులు నిర్వహిస్తారని, ప్రతి ఇంటికీ వారు వచ్చి వివరాలు సేకరిస్తారన్నారు. ప్రజలు సర్వే బృందాలకు సహకరించి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

తోట్లవల్లూరు: అట్టడుగు వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న పీ-4 సర్వేను సమర్థవంతంగా జరపాలని ఉయ్యూరు డివిజినల్ డవలప్‌మెంట్ అధికారి రాజేష్ పేర్కొన్నారు. ఈ విషయమై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీఆర్‌ఓలు, గ్రామ సర్వేయర్లు, ఏఎన్ఎంలు, అగ్రి అసిస్టెంట్‌లు, ఎంఎస్‌కేలకు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాజేష్ హాజరై పీ-4 సర్వే నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. శనివారం నుంచి 18వ తేదీ వరకు సర్వే జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. ఎంపీడీఓ రవికాంత్, తదితరులు పాల్గొన్నారు.



తోట్లవల్లూరులో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ రాజేష్



పమిడిముక్కలలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరావు

పేదరిక నిర్మూలనకు పీ4 సర్వే

పమిడిముక్కల: అట్టడుగున ఉన్న పేద కుటుంబాలకు మద్దతుగా నిలిచేలా ప్రోత్సహించడం పీ-4 సర్వే లక్ష్యమని ఎంపీడీఓ దేవరపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. వీరంకిలాకు కల్యాణ మండపంలో సచివాలయ సిబ్బందికి సర్వే నిర్వహణపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పేదరికాన్ని నిర్మూలించేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చేపడుతున్న ఈ కార్యక్రమ ఉద్దేశాన్ని నెరవేర్చేందుకు కృషి చేయాలన్నారు. సర్వేలో ఖచ్చితమైన డేటాను సేకరించాలన్నారు. కుటుంబాలు ప్రస్తుతం అందుకుంటున్న పథకాలపై ఈ సర్వే ఎలాంటి ప్రభావం చూపదని వివరించి, అపోహలు తొలగించాలన్నారు. సచివాలయ ఉద్యోగులందరూ 8వ తేదీ నుంచి 18వ తేదీ వరకు పదిరోజులపాటు సర్వేలో పాల్గొనాలని, ఎవరికీ మినహాయింపు లేదన్నారు. ట్రైనర్ కృష్ణమోహన్ సర్వేలోని 28 అంశాలను వివరించారు. ఏఎస్ఓ దీపిక పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు: మండలంలో పీ4 సర్వేను నిర్వహిస్తున్నామని జిల్లా బీసీ సంక్షేమాధికారి, మండల ప్రత్యేకాధికి జి.రమేష్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పీ-4 సర్వేపై అవగాహన సదస్సును చేపట్టారు. శనివారం నుంచి ప్రతి గ్రామంలో ఈ పీ-4 సర్వే ప్రారంభం అవుతుందన్నారు. ఈ సర్వే గురించి మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి అవగాహన అవసరమన్నారు. ఎంపీడీఓ టి.విజయసారథి, తహసీల్దార్ బి.లోకరాజు, ఎంఈఓలు గోపాలరావు, జగన్‌మోహన్‌రావు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

మొవ్వ: ఒకవైపు ఫ్లయింగ్ స్క్వాడ్ మరొకవైపు సిట్టింగ్ స్క్వాడ్ తనిఖీల నడుమ శుక్రవారం మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ రెండవ సంవత్సరం విద్యార్థుల పరీక్షలు జరిగాయి. ఈ కళాశాలలో 146 మంది పరీక్ష రాయాల్సి ఉండగా ముగ్గురు గైర్హాజరవగా 143 మంది పరీక్షలకు హాజరయ్యారు. సైన్స్ విద్యార్థులకు మ్యాథ్స్- 2ఏ, బోటనీ, ఫిజిక్స్, ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు ఆడిటింగ్, షార్ట్ హ్యాండ్, వర్క్ షాప్ టెక్నాలజీ సబ్జెక్ట్‌లకు శుక్రవారం పరీక్షలు జరిగినట్లు సీఎస్‌డీ సుధాకర్, ఎంపీ గంగాధర్ తెలిపారు.

గోల్డ్ కాయిన్‌లు అందజేత

పోలవరం(పామర్రు): కల్యాణమస్తు పథకంతో పాల ఉత్పత్తి దారులకు ఎంతో లబ్ధి చేకూరుతోందని కృష్ణా మిల్క్ యూనియన్ ట్రస్టు బోర్డు జిల్లా సభ్యుడు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి పేర్కొన్నారు.పోలవరం, పోలుకొండ గ్రామాల్లో లబ్ధిదారులకు ఈ పథకం ద్వారా బంగారునాణాన్ని శుక్రవారం బహూకరించారు. ఆయన మాట్లాడుతూ పోలవరంలోని పాల ఉత్పత్తి దారుడు వెన్నా సాంబశివరావు కుమార్తు నాగేంద్రకుమార్‌కు, పెంజెంద్ర పాల సేకరణ కేంద్రంలో పాలు పోసే సంఘ అధ్యక్షుడు పోలుకొండ నాగేశ్వరరావు కుమార్తె సునీతలకు కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చెలసాని ఆంజనేయులు పాడి రైతులకోసం ప్రవేశపెట్టిన కల్యాణ మస్తు పథకంలో ఒకొక్కరికి రూ.20 వేల విలువైన బంగారు కాయిన్‌లను అందజేశారు. పాల శీతల కేంద్రం మేనేజర్ చిట్టూరి దామోదర గోపీనాథ్, సంఘ అధ్యక్షులు, రూట్ సూపర్‌వైజర్ కైలరమేష్‌బాబు, వేతన కార్యదర్శులు పాల్గొన్నారు.

బ్యాంకుల బంద్ పోస్టర్ ఆవిష్కరణ

గుడ్లవల్లేరు: ఈనెల 24, 25 తేదీల్లో ఆలిండియా బంద్‌కు బ్యాంక్ ఉద్యోగులు పిలుపునిచ్చారని గుడివాడ బ్యాంక్ ఉద్యోగుల సంఘం కార్యదర్శి చిలుముల అభయాంజనేయ స్వామి అన్నారు. యునైటెడ్ ఫారమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్ పిలుపు మేరకు బంద్‌కు సంబంధించిన పోస్టర్‌ను అంగలూరులో శుక్రవారం ఆవిష్కరించారు.ఎన్నోసార్లు బ్యాంక్ అసోసియేషన్ చర్చలు జరిపినప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న వేల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, ఐదు రోజుల పని దినాలను అమలు జరపాలని, అవుట్‌సోర్సింగ్ నియామకాలు నిలిపివేయాలని, ఇప్పటి వరకు పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని తదితర డిమాండ్స్ చేశారు. సంఘ బ్యాంక్ ఉద్యోగుల సంఘం నేతలు ప్రియదర్శిని, శరత్ పాల్గొన్నారు.

ఐదోరోజుకు చేరిన గంగానమ్మతల్లి జాతర

పామర్రు: గంగానమ్మతల్లి జాతర మహోత్సవం శుక్రవారం నాటికి ఐదవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అమ్మవారిని ఆలయం వద్ద నుంచి ఘనంగా గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని 7, 8, 9, 10 వార్డులలో మేళ తాళాలతో డప్పు వాయిద్యాలతో గ్రామోత్సవం వైభవంగా జరిపారు. కార్యక్రమంలో 8వ వార్డు మెంబరు ఆరేపల్లి శ్రీహరి, పోతురాజు గడను కొద్దిసేపు మోసి మొక్కుబడి తీర్చుకున్నారు. భక్తులు అమ్మవారి ఘటం కుండకు ప్రత్యేక పూజలు చేసి చద్ది నివేదనలను సమర్పించారు. పోతురాజు గడకు నూతన వస్త్రాలను సమర్పించి పసుపుతో ఓలలాడించుకుని పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. ఈనెల 9వ తేదీతో జాతర మహోత్సవాలు పూర్తి కావస్తున్నాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈకార్యక్రమంలో పామర్రు వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, స్థానిక ఎంపీటీసీ సభ్యులు తాడిశెట్టి శ్రీనివాసరావు, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బొమ్మారెడ్డి వెంకట రామిరెడ్డి, సభ్యులు నందిపాటి బాలసుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, బి. రాజేష్‌రెడ్డి, గుజవర్తి చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.అంజిరెడ్డి, భీమవరపు శ్రీనివాసరెడ్డి తదితర సభ్యులు పాల్గొన్నారు.

భార్యను గాయపర్చిన భర్తపై కేసు

ముదినేపల్లి రూరల్: భార్యపై మంచంకోడుతో దాడి చేసిన భర్తపై స్థానిక పోలీసు స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదు చేశారు. మండలంలోని కొరగుంటపాలెంకు చెందిన పరసా లక్ష్మికి ద్వారకాతిరుమల మండలం పి.కన్నాపురానికి చెందిన భోగేశ్వరరావుతో వివాహం జరిగింది. ఇటీవల భార్యభర్తల మధ్య గొడవలు జరగడంతో లక్ష్మి కొరగుంటపాలెం పుట్టింట్లో ఉంటుంది. కొద్ది రోజుల క్రితం భర్త భోగేశ్వరరావు కొరగుంటపాలెం వచ్చి భార్యతో రాజీ చేసుకుని గ్రామంలోనే ఉంటున్నాడు. శుక్రవారం గ్రామంలో వినాయకుడి విగ్రహ ప్రతిష్ఠ జరగ్గా బంధువులతో కలసి లక్ష్మి భోజనానికి వెళ్లి వస్తుండగా, భర్త గొడవపెట్టుకుని మంచం కోడుతో భార్యపై దాడి చేశాడు. అడ్డువచ్చిన లక్ష్మీ తల్లిదండ్రులను సైతం గాయపర్చడంతో స్థానికులు 108 అంబులెన్సులో గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పులపర్రు వీఆర్వో మృతి

మండవల్లి: పులపర్రు వీఆర్వోగా పనిచేస్తున్న దేవనబోయిన వెంకటేశ్వరరావు శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. లీలాకృష్ణప్రసాద్ చెరువు వద్ద మృతదేహాన్ని గుర్తించామన్నారు. అనారోగ్య సమస్యల వల్ల గుండెపోటుతో మూత్రవిసర్జన చేస్తూ చెరువు గట్టు మీద పడిపోవడం వల్ల మృతి చెందినట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

గుడ్లవల్లేరు: అంగలూరులో తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా చేయటంపై డ్వాక్రా మహిళలకు అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి జి.రమేష్ అవగాహన కల్పించారు. ఎంపీడీవో టి.విజయసారధి, పంచాయతీ కార్యదర్శులు ఎలీషారావు, నరసింహారావు, సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు

























